క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

నరసాపురం: స్థానిక వాసవీక్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలో మరో వేసవి చలివేంద్రాన్ని శుక్రవారం స్థానిక స్టీమర్‌రోడ్డులో ఏర్పాటు చేశారు. ఇప్పటికే క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలో మూడు చోట్ల వేసవి చలివేంద్రాలు నడుస్తున్నాయి. క్లబ్ రీజినల్ చైర్మన్ వంకాయల శ్యామల చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్లబ్ సేవాతత్పరతతో పని చేస్తుందని అన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. క్లబ్ నరసాపురంశాఖ అధ్యక్షుడు నూలి శ్రీనివాస్, కార్యదర్శి కె.బాబ్జి, జోన్ చైర్మన్ ఎ.బదరీ, మండ రాజా, దేవత సుబ్బారావు, కె.బాబు తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పెనుగొండ గాంధీ బొమ్మల సెంటర్‌లో మజ్జిగ చలివేంద్రాన్ని నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ దాత దిగమర్తి కుమారి సహకారంతో నిర్వహించినట్లు మానవత సభ్యులు తెలిపారు. వేసవి తీవ్రత రోజురోజుకు పెరుగుతుండడంతో దాహార్తిని తీర్చడానికి దాతల సహకారంతో వేసవి పూర్తయ్యే వరకూ నిర్వహించనున్నట్లు తెలిపారు.

మందాలమ్మకు వెండి సమర్పణ


మందాలమ్మ ఆలయ కమిటీకి వెండి అందిస్తున్న దాతలు

పెనుగొండ: వడలి గ్రామ దేవత మందాలమ్మకు భద్రాచలానికి చెందిన దాతలు 500 గ్రాముల వెండిని సమర్పించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం ఆలయం వద్ద భద్రాచలానికి చెందిన రామకృష్ణ క్లాత్ స్టోర్స్ అధినేత దొడ్డిపట్ల సత్యలింగం, ఇందిర దంపతులు వెండి బిస్కట్లు అందించారన్నారు. సహకరించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

కిడ్నీ బాధితుడికి వాకర్స్ క్లబ్ సాయం


కిడ్నీ బాధితునికి మందులు అందజేస్తున్న పాలకొల్లు వాకర్స్ క్లబ్ సభ్యులు

యలమంచిలి: అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం అడవిపాలెం గ్రామానికి చెందిన వ్యవసాయ కార్మికుడు బోసుకొండ పాండురంగారావు తన రెండు కిడ్నీలు చెడి పోవడంతో డయాలిసిస్ చేయించుకుంటూ వైద్య సహాయం పొందుతున్నాడు. మందులు కొనుగోలు చేయలేని అతని పరిస్థితిని వాకర్స్ క్లబ్ పాలకొల్లు దృష్టికి తెలిసిన వ్యక్తులు తీసుకురావడంతో క్లబ్ పాలకవర్గ సభ్యులు స్పందించారు. క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు క్లబ్ తరఫున అతని భార్యకు పాలకొల్లులో శుక్రవారం 10 వేల రూపాయల విలువైన మందులను అందించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, కోశాధికారి పోతుల ఉమాశంకర్ రావు, సభ్యుడు టంగుటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వరప్రసాదరావుకు అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ అవార్డు


అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ అవార్డు స్వీకరిస్తున్న గుమ్మాపు సూర్య వరప్రసాదరావు

యలమంచిలి: పాలకొల్లుకు చెందిన పీవీ రావు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు, నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర వైస్ చైర్మన్ గుమ్మాపు సూర్య వరప్రసాదరావుకు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ అవార్డు వచ్చింది. విశాఖపట్నం లైబ్రెరి హాల్‌లో శుక్రవారం నిర్వహించిన వరల్డ్ చారిటీ వెల్ఫేర్ ఫౌండేషన్ అవార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయనకు ఈ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా గుమ్మాపు సూర్య వరప్రసాదరావు స్పందిస్తూ ఈ అవార్డు నా బాధ్యతను మరింత పెంచిందన్నారు.

ఎన్‌ఎస్ఎస్ నోడల్ ఆఫీసర్‌గా దుర్గాప్రసాద్

వీరవాసరం: ఎస్ఎంబీటీఏవీఅండ్ ఎస్ఎన్ డిగ్రీ కళాశాల కామర్స్ అధ్యాపకుడిగా పని చేస్తున్న వి.దుర్గాప్రసాద్‌ను పశ్చిమగోదావరి జిల్లా జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారిగా నియమించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వలవల నరసింహారావు శుక్రవారం తెలిపారు. నియామక పత్రాలను వి.దుర్గాప్రసాద్‌కు ప్రిన్సిపాల్ అందజేశారు.

కాలువ.. సమస్యల వెల్లువ

- అధ్వానంగా నరసాపురం కాలువ
- ప్రక్షాళనను పట్టించుకోని అధికారులు


నరసాపురం ప్రధాన కాలువ

పెనుగొండ: డెల్టాలో సాగులో ప్రధాన వనరైన నరసాపురం కాలువ నిర్వహణ లోపంతో కొట్టుమిట్టాడుతుంది. ఆచంట నియోజకవర్గంలో పెనుగొండ, పెనుమంట్ర, పోడూరు మండలాల మీదుగా నరసాపురం కాలువ ప్రవహిస్తూ ఉంటుంది. నియోజకవర్గంలో ప్రధాన పంట కాలువలైన కోడేరు బ్యాంకు కెనాల్, చించినాడ కాలువ, సత్యవరం, కవిటం పంట కాలువలకు ఈ కాలువ నుంచి సాగునీరు అందుతుంది. అయితే ప్రధాన కాలువ నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తుండడంతో కాలువ నిండా వ్యర్థాలు, కర్రనాచు పెరిగిపోయి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారుతుండడంతో రైతులకు ప్రతి ఏటా సాగునీరు సక్రమంగా అందక నానావస్థలు పడుతున్నారు.

కర్రనాచుతో ఇబ్బందులు

దాళ్వా సాగులో నీటి ఎద్దడి నివారణకు సీలేరు జలాలను గోదావరి ద్వారా, డెల్టాలో ప్రధాన కాలువలకు ప్రతి ఏటా అందిస్తుంటారు. దీని వలన ప్రధాన కాలువలోనే కాకుండా, పంట కాలువల్లోనూ కర్ర నాచు కుప్పలుకుప్పలుగా పెరిగిపోతుంది. ఇది వేసవిలో కాలువలు కట్టినపుడు ఎండతీవ్రతకు చనిపోయినా తిరిగి నీరు అందగానే కర్ర నాచు తీవ్రంగా పెరిగిపోతూ నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారుతుంది. అలాగే ఈదురుగాలులకు కూలిపోయిన వృక్షాలను కాలువల్లోనే వదలి వేయడంతో నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారుతున్నాయి. మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం వద్ద జెడ్ వంతెన వద్ద ఏడాది క్రితం కూలిపోయిన వృక్షం వ్యర్థాలు ఇంకా అలాగే ఉండడంతో వంతెనలో సగభాగం నిండిపోయి ఉండడంతో నీరు ప్రవహించే పరిస్థితి లేకుండా పోయింది. ఇదే పరిస్థితి కాలువ పొడవునా నెలకొని ఉంది. వృక్ష్య వ్యర్థాలు అలాగే పడి ఉండడంతో ఇబ్బందికరంగా మారిందంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాలువ నిర్వహణ అధ్వానం

ప్రతి ఏటా కాలువల నిర్వహణ పనులు చేపట్టకపోవడం వల్లే సాగు నీరు అందడం కష్టసాధ్యంగా మారిందంటూ రైతులు చెబుతున్నారు. కాలువ పొడవునా పేరుకుపోయిన కర్రనాచును పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ కాలువలో పేరుకుపోయిన వృక్ష వ్యర్థాలు, చెత్తకుప్పలను తొలగించి నీరు సవ్యంగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అధికారులు తక్షణం స్పందించి కాలువలకు మళ్లీ నీరు వచ్చే లోపు నిర్వహణ పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


కవిటం వద్ద కర్ర నాచు ఉధృతి


మార్టేరు జెడ్ వంతెన వద్ద నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న చెట్టు వ్యర్థాలు

వేసవిలో గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలి


ఆచంట వేమవరం పీహెచ్‌సీలో తనిఖీలు చేస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ

పెనుగొండ: వేసవి నేపథ్యంలో గర్భిణులు తగు జాగ్రత్తలు పాటించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ గీతాబాయ్ అన్నారు. శుక్రవారం ఆచంట మండలం ఆచంట వేమవరం వల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులను, ఓపీని పరిశీలించి, భవన నిర్మాణాన్ని పరిశీలించారు. జిల్లాలో ఎండల తీవ్రత క్రమేపీ పెరుగుతుండడంతో డయేరియా, వడదెబ్బ ఇతర సమస్యలు వచ్చే అకాశం ఉందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, సెలైన్ బాటిల్స్ అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. గర్భిణులు స్వచ్ఛమైన నీరు, కొబ్బరి నీళ్లు, పాలు, పండ్లు తరచూ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్లు పూజ, వేణుబాబు, హైందవి, ఎంపీహెచ్ఈఓ శివకుమార్, హెచ్‌వీ వసంతకుమారి పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ వేగవంతం


గుంపర్రులో రైతులతో మాట్లాడుతున్న జిల్లా పౌరసరఫరాల మేనేజర్ టి.శివరామ ప్రసాద్

యలమంచిలి: జిల్లాలో ఏప్రిల్ నెలాఖరు వరకు 263 రైతు సేవా కేంద్రాల ద్వారా 44,607 మంది రైతుల నుంచి రూ.967.19 కోట్లు విలువైన 4,19,595 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు జిల్లా పౌరసరఫరాల మేనేజర్ టి.శివరామ ప్రసాద్ చెప్పారు. మండలంలోని గుంపర్రు, మేడపాడు గ్రామాలలో శుక్రవారం ఆయన పర్యటించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించారు. రైతులకు ధాన్యం కొనుగోలు ప్రక్రియపై అవగాహన కల్పించారు. రైతు సేవా కేంద్రాలకు వెళ్లి అక్కడ ట్రక్ షీట్, ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ (ఎఫ్‌టీఓ) జనరేషన్ ఏ విధంగా చేస్తునారో? పరిశీలించారు. రైస్ మిల్లులకు ఇచ్చిన టార్గెట్‌కు అనుగుణంగా సంచులను రైతు సేవా కేంద్రాలకు వెంటనే అందజేయాలని, రైస్ మిల్లులకు వెళ్లిన ధాన్యం దిగుమతి అయిన వెంటనే ఆన్‌లైన్‌లో వెంటనే ధ్రువీకరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇప్పటి వరకు రూ. 914.51 కోట్లు ధాన్యం నగదును నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేశామన్నారు. రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటలలోపే ధాన్యం నగదును రైతుల బ్యాంకు ఖాతాకు నేరుగా జమ చేస్తున్నామన్నారు. గత రెండు రోజులకు సంబంధించి రూ.52.68 కోట్లు మాత్రమే రైతులకు బకాయి ఉందన్నారు. ఈ రబీ సీజనులో ధాన్యానికి కనీస మద్దతు ధర ప్రతి క్వింటాల్‌కు సాధారణ రకానికి రూ.2,300, గ్రేడ్-ఏ రకానికి రూ.2,320 చెల్లిస్తున్నట్లు ఆయన వివరించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి చిండులూరి దేవి ఉన్నారు.

పాలకొల్లువాసులకు దాసరి అవార్డులు


దాసరి సేవా రత్న అవార్డు అందుకుంటున్న యర్రంశెట్టి వెంకటరత్నం


దాసరి సేవా రత్న అవార్డు అందుకుంటున్న గుమ్ములూరి ఉదయ భాస్కరరావు

యలమంచిలి: పట్టణానికి చెందిన యర్రంశెట్టి వెంకటరత్నం, యలమంచిలి మండలం కొంతేరు గ్రామానికి చెందిన గుమ్ములూరి ఉదయభాస్కరరావులు హైదరాబాద్‌లో శుక్రవారం దాసరి సేవా రత్న అవార్డులు అందుకున్నారు. దాసరి నారాయణరావు జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్‌లో జరిగిన దాసరి ఫిలిం అవార్డు సభలో సినీ హీరోలు సుమన్, మురళీమోహన్, సాయికుమార్‌ల సమక్షంలో వారిరువురికి ఈ అవార్డులు అందజేశారు. వెంకటరత్నం సాహితీ, సాంస్కృతిక, నాటక రంగాల్లో, భాస్కరరావు జర్నలిజం, నాటకరంగాల్లో అందిస్తున్న విశేష సేవలకు గుర్తింపుగా ఈ అవార్డులు వరించాయి.

బాలికల విద్యతోనే సమగ్రాభివృద్ధి


పెనుగొండ: అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర వికాసం కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం


యలమంచిలి: ఆర్యపేటలో కిశోర వికాసం పోస్టర్ విడుదల చేస్తున్న దృశ్యం

పెనుగొండ: బాలికా విద్యతోనే సమగ్రాభివృద్ధి జరుగుతుందని ఐసీడీఎస్ ప్రాజెక్టు పెనుమంట్ర సీడీపీఓ ఎ.కృష్ణకుమారి అన్నారు. కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పెనుగొండ అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో సమ్మర్ క్లాసులు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జి.సుజాత, విలేజ్ కమిటీ సభ్యులు కె.ఉమామహేశ్వరి, జె.ఉదయ లక్ష్మీ, ఎస్.వెంకట లక్ష్మీ, ఎస్. పద్మజ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యపేటలో..

యలమంచిలి: ప్రతి సచివాలయ పరిధిలో కిశోర వికాసం కార్యక్రమాన్నిమే 2 నుంచి జూన్ 10 వరకు నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీనా చెప్పారు. ఈ కార్యక్రమంలో పోషణ అవసరాలు, కిషోర బాలికల సమస్యలు, చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్స్, పిల్లల సంరక్షణ, కిషోర బాలికలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, సత్ప్రవర్తనతో తల్లి తండ్రికి మంచి పేరు తీసుకురావడం గురించి వివరిస్తారన్నారు. కనకాయలంకలో ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాసరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా మిగిలిన సచివాలయాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ప్రారంభించారు.

పాలకొల్లు ఆర్యవైశ్య సంఘంలో అధ్యక్ష ఎన్నికల చిచ్చు

- పోటాపోటీగా బరిలో నిలిచిన లోకల్, నాన్ లోకల్ అభ్యర్థులు
- రేపే ఎన్నికలు


రేపాక ప్రవీణ్ భాను


తెలనాకులు కోటేశ్వరరావు

పాలకొల్లు సెంట్రల్: ఆర్యవైశ్య సంఘంలో ఈ ఏడాది అధ్యక్ష ఎన్నికల వ్యవహారం చిచ్చు పెడుతోంది. లోకల్, నాన్ లోకల్ పేరుతో వారిలో నెలకొన్న విభేదాలు ఇప్పుడు రోడ్డెక్కుతున్నాయి. వీరంతా స్థానిక వైశ్యులు, పడమర (నెల్లూరు) వైశ్యులు, తూర్పు (శ్రీకాకుళం) వైశ్యులుగా చీలిపోయినట్టు తెలుస్తోంది. పాలకొల్లు ఆర్యవైశ్య సంఘం 1968లో సంఘం ఏర్పడింది. 1971లో రిజిస్ట్రేషన్ అయ్యింది. నాటి నుంచి నేటి వరకు ఒక్కసారి మాత్రమే నాన్ లోకల్ (పడమర) వైశ్యులు అధ్యక్ష పదవి చేపట్టినట్టు తెలుస్తోంది. ప్రతిసారీ స్థానిక ఆర్యవైశ్యులే అధ్యక్ష పదవిలో ఉంటున్నారని, సెక్రటరీ, ట్రెజరర్ పోస్టులు మాత్రం నాన్ లోకల్ వారికి ఇస్తున్నారని సమాచారం. ఈ పర్యాయం మాత్రం ఎట్టి పరిస్థితుల్లో అధ్యక్ష పదవి తమకే ఇవ్వాలని పడమర వైశ్యులు గట్టిగా పట్టుబడుతున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈసారికి వదిలేయండి.. వచ్చే పర్యాయం మీకు ఇస్తామని స్థానిక వైశ్యులు కూడా అంతే గట్టిగా చెబుతున్నట్టు తెలుస్తోంది. వీరితో పాటు చాలామంది అధ్యక్ష పదవికి నామినేషన్లు వేశారు. దీంతో సంఘ పెద్దలు వారితో కూర్చుని మంతనాలు జరపగా పలువురు పోటీ నుంచి విరమించుకున్నారు. లోకల్, నాన్ లోకల్ అభ్యర్థులు ఇద్దరూ మాత్రం ససేమిరా అనడంతో ఎన్నిక అనివార్యమైనట్టు తెలుస్తోంది. పోటీలో ఉన్న అభ్యర్థుల్లో రేపాక ప్రవీణ్ భాను స్థానిక వైశ్యుడు కాగా, తెలనాకుల కోటేశ్వరరావు స్థానికేతరుడని చెబుతున్నారు.

1500 మంది ఓటర్లు

ఆర్యవైశ్య సంఘంలో ఓటర్ల సంఖ్య సుమారు 1500 మంది వరకు ఉంది. పురుషులు 1000 మంది, మహిళలు 500 మంది వరకు ఉన్నట్టు సమాచారం. వారిలో స్థానిక వైశ్యులు 1000 మంది, పడమర వైశ్యులు 350 మంది, తూర్పు వైశ్యులు 150 మంది ఉన్నట్టు తెలిసింది. ఓట్ల పరంగా స్థానికులే బలంగా ఉన్నప్పటికీ ఈసారి నాన్ లోకల్ వైశ్యులు ఏకమవ్వాలనే లోపాయికారీ చర్చ జరుగుతున్నట్టు సమాచారం. స్థానిక వైశ్యుల్లోనూ కొన్ని విభేదాలు ఉన్నాయని, ఇరువర్గాల వారు బంధుత్వాలు కలుపుకోవడం వల్ల కూడా బలాబలాలను అంచనా వేయడం కష్టమని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఈ నెల 4న అంటే ఆదివారం జరగబోయే అధ్యక్ష ఎన్నికలపై అందరి దృష్టి పడింది.

వైఎస్సార్ సీపీ పటిష్టానికి కృషి చేయాలి


ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాసరావు, మద్దా శ్రీనివాసరావులను సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉచ్చుల స్టాలిన్‌బాబు

యలమంచిలి: వైఎస్సార్ సీపీ పటిష్టం చేయడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉచ్చుల స్టాలిన్‌బాబు అన్నారు. శుక్రవారం ఆయన కనకాయలంక గ్రామంలో పర్యటించారు. పార్టీ నాయకులను కలుసుకుని పార్టీ పటిష్టానికి తీసుకోవాల్సిన చర్యలను గురించి నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన తనకు పదవి రావడానికి సహకరించిన ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాసరావు, కనకాయలంక సర్పంచ్, పాలకొల్లు నియోజకవర్గ డాక్టర్స్ వింగ్ అధ్యక్షుడు మద్దా శ్రీనివాసరావులను శాలువా, పూలమాలలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వలవల ప్రసాద్, పులి సుబ్రహ్మణ్యం, పులి కాశీ, యన్నాబత్తుల సుధీర్, చిల్లే రాజు, చిల్లే ప్రసాద్, దుద్దే ప్రభాకరరావు, చింద్రిపు గణపతి, లంక కిషోర్, వీరా ఉమాశంకర్, కల్యాణం గంగాధర రావు, కుక్కల బాలచంద్రన్, సిర్రా నాగరాజు తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా ఆటాడుకుందాం

- జిల్లాలో 50 వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభం
- విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతుల ప్రదానం


తణుకు ఆర్చరీ శిక్షణా శిబిరంలో బాలలు

భీమవరం: వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని పూర్తిగా వృథా చేయకుండా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 50 కేంద్రాల్లో గురువారం ప్రారంభమైన క్రీడా శిక్షణ ఈ నెల 31వ తేదీ వరకు నిర్వహించి, శిక్షణ పూర్తి చేసిన క్రీడాకారులకు పోటీలు నిర్వహించి, విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేస్తారు. జిల్లాలో ఏర్పాటు చేసిన క్రీడా శిక్షణ శిబిరాల వివరాలను డీఎస్‌డీఓ ఎం.రాజేష్ తెలిపారు. ఎనిమిది నుంచి 15 ఏళ్ల లోపు పిల్లలకు శిక్షణ ఇచ్చే విధంగా క్రీడా శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. గురువారం నుంచి ప్రారంభమైన శిక్షణలో కొత్త వారిని కూడా చేర్చుకుంటారని, వీటిని బాలలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

క్రీడా శిబిరాలు నిర్వహించే ప్రాంతాలు

- ఆర్చరీ: తణుకు మాంటిస్సోరి స్కూల్
- అథ్లెటిక్స్: తణుకు ఎస్‌సీఐఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, భీమవరం డీఎన్నార్ కళాశాల, తాడేపల్లిగూడెం కోడే వెంకట్రావు హైస్కూల్, శృంగవృక్షం జెడ్పీ హైస్కూల్
- బాస్కెట్‌బాల్: మార్టేరు ఎస్‌వీజీజెడ్పీ స్కూల్, తాడేపల్లిగూడెం కోడే వెంకట్రావు హైస్కూల్, తణుకు జెడ్పీహెచ్‌ఎస్ బాయిస్ స్కూల్, భీమవరం డీఎన్నార్ కళాశాల, పెనుగొండ ఎస్‌వీకేపీ డాక్టర్ కేఎస్ రాజు కళాశాల, తణుకు మాంటిస్సోరీ స్కూల్, పెంటపాడు సరస్వతి విద్యాలయ స్కూల్
- బ్యాడ్మింటన్: పెనుగొండ ఎస్‌వీకేపీ కేఎస్‌రాజు కళాశాల
- బాక్సింగ్: పెనుమంట్ర ఎస్ఆర్ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, పెనుగొండ ఎస్‌వీకేపీ డాక్టర్ కేఎస్ రాజు కళాశాల, నవుడూరు కేఎస్ఎన్ఆర్ డిగ్రీ కళాశాల, అత్తిలి జెడ్పీ బాయిస్ హైస్కూల్, తణుకు ఎస్‌సీఐఎంజీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అత్తిలి ప్రభుత్వ హైస్కూల్
- క్రికెట్: పెంటపాడు సరస్వతి విద్యాలయ స్కూల్, భీమవరం డీఎన్నార్ కళాశాల
- ఫుట్‌బాల్: పెంటపాడు సరస్వతి విద్యాలయ స్కూల్, భీమవరం లూథరన్ హైస్కూల్, భీమవరం డీఎన్నార్ కళాశాల
- జిమ్నాస్టిక్: భీమవరం డీఎన్నార్ కళాశాల
- హాకీ: భీమవరం సెంట్‌మేరీస్ హైస్కూల్, శృంగవృక్షం జెడ్పీ హెచ్‌ఎస్ హైస్కూల్.
- కబడ్డీ: తాడేపల్లిగూడెం టీఎస్ఎం జెడ్పీ హెచ్ స్కూల్, తణుకు ఎస్‌సీఐఎం ఆర్ట్స్ డిగ్రీ కళాశాల, తణుకు మాంటిస్సోరీ స్కూల్, పెనుగొండ ఎస్‌వీకేపీ డాక్టర్ కేఎస్ రాజు కళాశాల
- కరాటే: మార్టేరు ఎస్‌వీజీజెడ్పీ స్కూల్
- స్కిప్పింగ్: తణుకు మున్సిపల్ పార్క్, తణుకు మాంటిస్సోరీ స్కూల్,
- టేబుల్ టెన్నిస్: భీమవరం ఎస్‌సీహెచ్‌బీఆర్ఎం హైస్కూల్, పెనుగొండ ఎస్‌వీకేపీ డాక్టర్ కేఎస్ రాజు కళాశాల
- తైక్వాండో: తాడేపల్లిగూడెం ద్రోణాచార్య స్పోర్ట్స్ క్లబ్
- టెన్నిస్: భీమవరం డీఎన్ఆర్ కళాశాల
- త్రోబాల్: సిద్ధాపురం జెడ్పీహెచ్ స్కూల్
- వాలీబాల్: మండపాక ప్రైమరీ స్కూల్ నంబర్ 3, గూట్లపాడు జెడ్పీహెచ్ స్కూల్, ఇలింద్రపర్రు జెడ్పీహెచ్ స్కూల్, తణుకు ఎస్‌సీఐఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, భీమవరం డీఎన్నార్ కళాశాల, సిద్ధాపురం జెడ్పీహెచ్ స్కూల్, తణుకు జెడ్పీహెచ్ స్కూల్, అత్తిలి ప్రభుత్వ హైస్కూల్, పెనుగొండ ఎస్‌వీకేపీ డాక్టర్ కేఎస్ రాజు కళాశాల
- యోగా: గూట్లపాడు జెడ్పీహెచ్ స్కూల్, భీమవరం ఎస్‌సీహెచ్‌బీఆర్ఎం హైస్కూల్.


కబడ్డీ శిక్షణలో బాలికలు


త్రోబాల్ శిక్షణలో బాలురు

రాయితీపై డ్రిప్, స్ప్రింక్లర్లు

భీమవరం: సూక్ష్మ సేద్య పథకంలో రైతులకు ప్రభుత్వం రాయితీపై డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలు అందిస్తుందని దీనికిగాను రైతులు తమ గ్రామంలోని రైతుసేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా ఉద్యానవన శాఖాధికారి పి.వీరభద్రరావు చెప్పారు. బిందు సేద్యం సబ్సిడీ ఎస్సీ, ఎస్టీ చిన్న, సన్నకారు రైతులకు నూరు శాతం సబ్సిడీ, ఇతర చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం సబ్సిడీ ఇస్తామని స్పష్టం చేశారు.